గుజరాత్ చేతిలో చిత్తైన సన్‌రైజర్స్

# ఓటమి నెం. 4

**సమిష్టి వైఫల్యంతో బేజారు • సొంత వేదికలోనూ ఘోర పరాభవం • మెరిసిన సిరాజ్**

**గత సీజన్‌లో భారీ స్కోర్లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఈ సీజన్‌లో సమిష్టి వైఫల్యంతో దారుణంగా విఫలమవుతున్నది. సొంత వేదికలోనూ విఫలమవుతున్న సన్‌రైజర్స్.. ఆదివారం గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లోనూ బ్యాటింగ్‌లో చేతులెత్తేసింది. టైటాన్స్ పేసర్ మహ్మద్ సిరాజ్ ధాటికి 152 పరుగులకే పరిమితమైన రైజర్స్.. తర్వాత బంతితో కూడా మాయ చేయలేక ఈ టోర్నీలో వరుసగా నాలుగో పరాభవాన్ని మూటగట్టుకుని ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. స్వల్ప ఛేదనలో గుజరాత్‌కు గిల్.. మరోసారి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి విజయాన్ని అందించాడు.**



హైదరాబాద్: ఐపీఎల్-18లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) వరుస వైఫల్యాల పరంపర కొనసాగుతున్నది. ఇప్పటికే పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన సన్‌రైజర్స్.. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ పరాభవం పాలైంది. సమిష్టిగా విఫలమైన హైదరాబాద్‌పై గుజరాత్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. 'లోకల్ భాయ్' సిరాజ్ (4/17) ధాటికి నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 152 పరుగులకే పరిమితమైంది. నితీశ్ కుమార్ రెడ్డి (34 బంతుల్లో 31, 3 ఫోర్లు) టాప్ స్కోరర్. సాయి కిశోర్ (2/24), ప్రసిధ్ కృష్ణ (2/25) హైదరాబాద్‌ను కట్టడిచేశారు. ఛేదనను గుజరాత్.. 16.4 ఓవర్లలోనే పూర్తిచేసింది. శుభ్‌మన్ గిల్ (43 బంతుల్లో 61 నాటౌట్, 9 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్ (29 బంతుల్లో 49, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), రూథర్‌ఫర్డ్ (16 బంతుల్లో 35 నాటౌట్, 6 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. సిరాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఈ సీజన్‌లో హైదరాబాద్‌కు ఇది నాలుగో ఓటమి కాగా గుజరాత్‌కు ఆడిన నాలుగు మ్యాచ్‌లలో మూడో విజయం.

### దంచేసిన గిల్, సుందర్

స్వల్ప ఛేదనను గుజరాత్ కూడా పేలవంగానే ఆరంభించింది. షమీ (2/28), కమిన్స్ (1/26) ధాటికి టైటాన్స్.. ఐదు ఓవర్లలో 28/2గా నిలిచింది. షమీ మూడో ఓవర్లో సుదర్శన్ (5) అనికేత్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్ అవగా మరుసటి ఓవర్లో కమిన్స్.. బట్లర్‌ను డకౌట్ చేయడంతో గెలుపుపై హైదరాబాద్ అభిమానుల్లో ఆశలు చిగురించాయి. కానీ గుజరాత్ తరఫున తొలి మ్యాచ్ ఆడిన వాషింగ్టన్.. కెప్టెన్ గిల్‌తో కలిసి ఆ ఆశలను ఆదిలోనే తుంచేశాడు. సిమర్‌జిత్ 6వ ఓవర్లో వాషింగ్టన్.. 4, 4, 6, 6తో 20 పరుగులు పిండుకున్నాడు. ఇక ఆ తర్వాత గుజరాత్ వెనుదిరిగి చూడలేదు. క్రీజులో నిలదొక్కుకున్నాక గిల్ కూడా జోరు పెంచాడు. సుందర్ అంత వేగంగా ఆడకపోయినా గిల్.. 38 బంతుల్లో అర్ధశతకం పూర్తయింది. అయితే హాఫ్ సెంచరీకి ఒక్క పరుగు దూరంలో ఉండగా షమీ వేసిన 14వ ఓవర్లో తొలి బంతికి అనికేత్ అద్భుత డైవ్ క్యాచ్‌తో వాషింగ్టన్ పెవిలియన్ చేరడంతో 90 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సుందర్ నిష్క్రమించినా ఇషాంత్ స్థానంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రూథర్‌ఫర్డ్.. అభిషేక్ 15వ ఓవర్లో నాలుగు బౌండరీలు బాది టైటాన్స్‌ను విజయానికి చేరువ చేశాడు. కమిన్స్ ఓవర్‌లో 6, 4తో మ్యాచ్‌ను ముగించాడు.

### బోరింగ్ బ్యాటింగ్!

ఓపెనర్ల నిష్క్రమణ తర్వాత రైజర్స్ డిఫెన్స్‌కే పరిమితమైంది. ఒక దశలో 36 బంతుల పాటు బౌండరీ రాలేదు. 4 ఓవర్ నుంచి 10వ ఓవర్ మధ్యలో మన బ్యాటర్లు సింగిల్స్‌తోనే సరిపెట్టారు. ఇన్నింగ్స్ మొత్తమ్మీద రెండు సిక్సర్లే నమోదయ్యాయంటే మన బ్యాటింగ్ ఎంత పేలవంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఓపెనర్లతో పాటు ఇషాన్ కిషన్ (17), హెన్రిచ్ క్లాసెన్ (31) నిరాశపరచగా నితీశ్ 34 బంతులాడినా ధాటిగా ఆడలేకపోయాడు. ప్రసిధ్ 8వ ఓవర్లో రెండో బంతిని పుల్ చేయబోయిన ఇషాన్.. డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ వద్ద ఇషాంత్‌కు చిక్కాడు. క్లాసెన్.. రషీద్ ఖాన్ 13వ ఓవర్లో నాలుగో బంతిని స్టాండ్స్‌లోకి పంపించి హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో తొలి సిక్సర్ నమోదుచేశాడు. కానీ సాయి కిషోర్.. వరుస ఓవర్లలో క్లాసెన్‌తో పాటు నితీశ్‌ను ఔట్ చేసి రైజర్స్ భారీ స్కోరు ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి స్పెల్‌లో బంతి నందుకున్న సిరాజ్.. మరోమారు రైజర్స్‌ను దెబ్బకొట్టాడు. 19వ ఓవర్లో అతడు.. అనికేత్ (18)తో పాటు సిమర్‌జిత్‌నూ ఔట్ చేశాడు. ఆఖర్లో కమిన్స్ (9 బంతుల్లో 22 నాటౌట్, 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో హైదరాబాద్.. గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది.



### సిరాజ్ జోరు..

ఈ సీజన్‌లో ఆరంభ మ్యాచ్ మినహా తర్వాత వరుసగా విఫలమవుతున్న సన్‌రైజర్స్.. గుజరాత్‌తో పోరులోనూ వైఫల్య ప్రదర్శనను కొనసాగించింది. గత మ్యాచ్‌ల మాదిరిగానే టాపార్డర్ చేతులెత్తేయడం రైజర్స్‌ను దెబ్బతీసింది. తాజా సీజన్‌లో గుజరాత్‌కు ఆడుతూ సంచలన ప్రదర్శనలతో సత్తాచాటుతున్న హైదరాబాదీ పేసర్ సిరాజ్ దెబ్బకు కమిన్స్ సేన ఆరంభంలోనే రిథమ్ కోల్పోయింది. విధ్వంసకర 'ట్రావిషేక్' ఓపెనింగ్ జోడీని పెవిలియన్‌కు పంపిన సిరాజ్.. ఆరంభ ఓవర్లలోనే హైదరాబాద్‌కు షాకులిచ్చాడు. మొదటి ఓవర్‌లోనే రెండు బౌండరీలతో జోరు మీద కనిపించిన హెడ్ (8).. ఆ ఓవర్లో సిరాజ్ వేసిన ఆఖరి బంతికి మిడ్ వికెట్‌లో సుదర్శన్ చేతికి చిక్కడంతో రైజర్స్ వికెట్ల పతనం మొదలైంది. ఇషాంత్ శర్మ రెండో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో అలరించిన అభిషేక్.. సిరాజ్ ఐదో ఓవర్లో మిడాన్ వద్ద తెవాటియాకు క్యాచ్ ఇచ్చాడు. ఐపీఎల్‌లో సిరాజ్‌కు ఇది వందో వికెట్.

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| ఢిల్లీ | 3 | 3 | 0 | 6 | 1.25 |
| గుజరాత్ | 4 | 3 | 1 | 6 | 1.03 |
| బెంగళూరు | 3 | 2 | 1 | 4 | 1.14 |
| పంజాబ్ | 3 | 2 | 1 | 4 | 0.07 |
| కోల్‌కతా | 4 | 2 | 2 | 4 | 0.07 |
| లక్నో | 4 | 2 | 2 | 4 | 0.04 |
| రాజస్థాన్ | 4 | 2 | 2 | 4 | -0.18 |
| ముంబై | 4 | 1 | 3 | 2 | 0.10 |
| చెన్నై | 4 | 1 | 3 | 2 | -0.89 |
| హైదరాబాద్ | 5 | 1 | 4 | 2 | -1.62 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

### సంక్షిప్త స్కోర్లు:

హైదరాబాద్: 20 ఓవర్లలో 152/8 (నితీశ్ 31, క్లాసెన్ 27, సిరాజ్ 4/17, సాయి 2/24); గుజరాత్: 16.4 ఓవర్లలో 153/3 (గిల్ 61, సుందర్ 49, షమీ 2/28, కమిన్స్ 1/26)



### జపాన్ గ్రాండ్ ప్రి విజేత వెర్‌స్టాపెన్

సుజుక (జపాన్): అచ్చొచ్చిన వేదికపై రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (నెదర్లాండ్స్) మరోసారి సత్తాచాటాడు. ఆదివారం అతడు జపాన్ గ్రాండ్ ప్రి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో టైటిల్ విజేతగా నిలవడం అతడికి ఇదే మొదటిది కాగా జపాన్ గ్రాండ్ ప్రి రేసును గెలవడం వరుసగా నాలుగోసారి కావడం విశేషం. క్వాలిఫయింగ్ రేసులో అదరగొట్టిన వెర్‌స్టాపెన్.. ఫైనల్ రేసును 1:22:06 నిమిషాల్లో (ఒక నిమిషం 22 సెకన్లు) పూర్తి చేశాడు. మెక్‌లారెన్ డ్రైవర్లు నోరిస్, పియాస్ట్రి వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

### పసిడి నెగ్గిన రుద్రాంక్ష్



బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత యువ షూటర్ రుద్రాంక్ష్ పాటిల్ పసిడి గెలిచాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రుద్రాంక్ష్.. 252.9 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణం సాధించాడు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది రెండో స్వర్ణం.



### అధ్యక్షుడిగా విక్రమ్ ఆదిత్య

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విక్రమ్ ఆదిత్య రెడ్డి ఎన్నికయ్యారు. 2025-29 కాలానికి గాను ఆదివారం జరిగిన ఎన్నికల్లో కొత్త కార్యవర్గం ఏర్పాటు కాగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా రామ్మోహన్.. ఉపాధ్యక్షులుగా మహ్మద్ ఖాజా, వెంకటేశ్వర్ రావు, లిల్లీ ఫ్లోరెన్స్, దీపిక ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శిరీష రాణి, ట్రెసరర్‌గా రాముని ఎన్నుకున్నట్టు నెట్‌బాల్ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది.

# హితేశ్‌కు స్వర్ణం

**బాక్సింగ్ కప్‌లో భారత్‌కు 6 పతకాలు**





ఢిల్లీ: బ్రెజిల్ వేదికగా జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. ఒక స్వర్ణం, ఒక రజతంతో పాటు నలుగురు బాక్సర్లు కాంస్య పతకాలు సాధించారు. శనివారం రాత్రి జరిగిన పురుషుల 70 కిలోల విభాగంలో హితేశ్.. ఒడెల్ కమర (ఇంగ్లండ్)పై గెలిచి పసిడి గెలుచుకున్నాడు. ప్రత్యర్థి గాయంతో రింగ్ నుంచి తప్పుకోవడంతో హితేశ్ విజేతగా నిలిచాడు. అతడితో పాటు పురుషుల 65 కిలోల విభాగంలోనూ ఫైనల్ చేరిన మరో బాక్సర్ అభినాష్.. ఫైనల్‌లో యురి రీస్ (బ్రెజిల్) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీలో జదుమణి సింగ్, మనీశ్ రాథోడ్, సచిన్, విశాల్ కూడా తమ విభాగాల్లో కాంస్యాలు సాధించి సత్తాచాటారు. ఈ పోటీలలో పది మంది బృందంతో బరిలో నిలిచిన భారత్.. ఆరు పతకాలతో సత్తా చాటడం విశేషం.

### బుమ్రా వచ్చేశాడు



ముంబై: ఐపీఎల్-18లో పడుతూ లేస్తూ సాగుతున్న ముంబై ఇండియన్స్‌కు శుభవార్త. ఆ జట్టు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆదివారం జట్టుతో చేరాడు. ఈ విషయాన్ని ముంబై తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా వెల్లడించింది. హార్దిక్ సేన నేడు (మే 7న) వాంఖడే వేదికగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ ఆడనుండగా ఈ పోరులో బుమ్రా బరిలోకి దిగనున్నట్టు సమాచారం. ఈ ఏడాది జనవరిలో ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా పెర్త్‌లో జరిగిన ఐదో టెస్టులో గాయపడ్డ బుమ్రా.. ఇన్నాళ్లు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో పునరావాసం పొందాడు. బీసీసీఐ కూడా రెండ్రోజుల క్రితమే బుమ్రా బౌలింగ్ చేయడానికి క్లియరెన్స్ ఇచ్చింది. అయితే బుమ్రా బెంగళూరుతో ఆడతాడా? లేక ఈనెల 17న హైదరాబాద్‌తో మ్యాచ్ వరకు ఆగుతాడా? అనేది నేడు తేలనుంది.

### రిటైర్మెంట్‌పై నిర్ణయం నాది కాదు: ధోనీ



చెన్నై: గత రెండు మూడు సీజన్ల మాదిరిగానే తాజా సీజన్ లోనూ భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ రిటైర్మెంట్‌పై ఆసక్తికర చర్చ సాగుతున్నది. శనివారం ఢిల్లీతో ముగిసిన మ్యాచ్‌లో ధోనీ తల్లిదండ్రులు చెపాక్ స్టేడియానికి రావడంతో అతడు రిటైర్మెంట్ ప్రకటిస్తాడన్న ఊహాగానాలు వెల్లువెత్తాయి. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'వీళ్లు నన్ను వీల్‌చైర్‌లో ఉన్నా ఆడిస్తారు' అని ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ఈ చెన్నై మాజీ సారథి.. తాజాగా మరోసారి స్పందించాడు. ఓ పోడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ధోనీ స్పందిస్తూ 'ఇప్పటికిప్పుడైతే ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించను. ఇప్పుడు నాకు 43 ఏండ్లు. ఈ సీజన్ ముగిసేసరికి జులైలో నాకు 44 వస్తాయి. తర్వాతి సీజన్‌లో ఆడాలా? వద్దా? అని నిర్ణయించుకోవడానికి నాకు మరో 10 నెలల సమయముంది. అయినా నా రిటైర్మెంట్ గురించి నిర్ణయించేది నేను కాదు. నా శరీరం. మనం ఆడాలా, వద్దా అని నిర్ణయించేదదే' అని అన్నాడు. ఈ సీజన్‌లో నాలుగు ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్‌కు వచ్చిన మహి.. 76 పరుగులు చేసినా అవి జట్టును గెలిపించేవైతే కాదన్న విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తాజాగా అతడి వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

# అర్జున్ సందడి షురూ..



నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. చాలా విరామం తర్వాత విజయశాంతి ఇందులో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈ సినిమా కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. కల్యాణ్‌రామ్, విజయశాంతి డైనమిక్‌గా ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని, త్వరలో గ్రాండ్ ఈవెంట్‌ని నిర్వహించనున్నామని, ఆ ఈవెంట్‌లోనే ట్రైలర్‌ని లాంచ్ చేస్తామని మేకర్స్ తెలిపారు. సాయి మంజ్రేకర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సోహైల్‌ఖాన్, యానిమల్ పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి కథనం: శ్రీకాంత్ విస్సా, కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోకనాథ్, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.

## యూత్‌కి జాక్ ఓ మెమరబుల్ ట్రీట్..



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జాక్ - కొంచెం క్రాక్'. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకుడు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. వైష్ణవి చైతన్య కథానాయిక. ఈ నెల 10న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ చిత్ర యూనిట్ ఏపీలోని భీమవరం విష్ణు కాలేజ్‌లో సందడి చేసింది. యూత్ ఓ రేంజ్‌లో ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుందని, అందరికీ తప్పక నచ్చుతుందని, స్టూడెంట్స్ అంతా థియేటర్లకు వచ్చి ఎంజాయ్ చేయాలని హీరోహీరోయిన్లు సిద్ధు, వైష్ణవి కోరారు. 'జాక్' సినిమా అద్భుతంగా వచ్చిందని, సిద్ధును హీరోగా మరోస్థాయిలో నిలబెట్టే సినిమా అవుతుందని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మనసుల్ని హత్తుకునే ప్రేమకథ



తెలుగమ్మాయి సుమయరెడ్డి కథానాయికగా నటిస్తూ నిర్మించిన ఫీల్‌గుడ్ ఎమోషనల్ లవ్ స్టోరీ 'డియర్ ఉమ'. ఈ సినిమాకు రచయిత కూడా ఆమే కావడం విశేషం. సాయిరాజేష్ మహాదేవ్ దర్శకుడు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఇప్పటివరకూ విడుదల చేసిన ప్రచార చిత్రాల వల్ల సినిమాపై అంచనాలు పెరిగాయని, ఇందులో అద్భుతమైన ప్రేమకథతోపాటు చక్కని సందేశం కూడా ఉంటుందని, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కిన ఈ చిత్రంలో సగటు ప్రేక్షకుడికి కావాల్సిన అంశాలన్నీ ఉంటాయని మేకర్స్ తెలిపారు. పృథ్వీ అంబర్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, సప్తగిరి, అజయ్‌ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, రూపలక్ష్మి, తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: రథన్, నిర్మాణం: సుమ చిత్ర ఆర్ట్స్.


చిత్రం



## ముంబయ్‌లో ఓదెల 2 హంగామా

నాగసాధువుగా తమన్నా భాటియా నటించిన సూపర్ నాచురల్ పాన్ ఇండియా థ్రిల్లర్ 'ఓదెల 2'. ఓటీటీ హిట్ 'ఓదెల రైల్వేస్టేషన్'కి ఇది సీక్వెల్. అశోక్‌తేజ దర్శకుడు. డి.మధు నిర్మాత. సంపత్ నంది దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని ఈ నెల 8న ముంబయ్‌లో జరిగే ఓ ఈవెంట్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. 'ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో చేశాం. టీజర్‌ను కుంభమేళాలో విడుదల చేశాం. ట్రైలర్‌ని ముంబయ్‌లో విడుదల చేయనున్నాం. తెలుగుతోపాటు హిందీ ట్రైలర్‌ని కూడా అదే వేదికపై విడుదల చేస్తాం. సినిమాపై అంచనాలు పెంచేలా ట్రైలర్ ఉంటుంది' అని మేకర్స్ తెలిపారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్.సింహ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రంలో యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారీ, సురేందర్‌రెడ్డి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్.ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్.

## సీతా పయనం.. పవనుడి సాయం..




యాక్షన్‌కింగ్ అర్జున్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'సీతా పయనం'. ఆయన కుమార్తె ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ కీలక పాత్రధారులు. అర్జున్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. వీరితోపాటు కన్నడ స్టార్‌హీరో ధ్రువ సర్జా కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగం అయ్యారు. ఆయన ఇందులో 'పవన్' అనే ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ సినిమాలో ధ్రువ సర్జా పోషిస్తున్న 'పవన్' పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పొడవాటి జుట్టు, గడ్డంతో మాస్ మెచ్చేలా ఈ పోస్టర్‌లో ధ్రువ కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నది. ధ్రువ సర్జా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: జి.బాల మురుగన్, సంగీతం: అనూప్ రూబెన్స్, నిర్మాణం: శ్రీరామ్ ఫిల్మ్ ఇంటర్నేషనల్.

## హిందీ సినిమాలో మెయిన్ లీడ్



ఇంట గెలిచి రచ్చ గెలవమనేది ఆర్యోక్తి. మన తెలుగమ్మాయి అనన్య నాగళ్ల ఆ మాటను నిజం చేస్తూ.. ముందు ఇంటను గెలిచి.. ఇప్పుడు రచ్చను గెలిచేందుకు సమాయత్తమవుతున్నది. మల్లేశం, వకీల్‌సాబ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న అనన్య.. ఆ తర్వాత ప్లేబ్యాక్, తంత్ర, పొట్టేల్, బహిష్కరణ(వెబ్ సిరీస్) వంటి ప్రాజెక్టులతో మంచి నటిగా కూడా కితాబులందుకున్నది. త్వరలో ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్ డెబ్యూ ఇవ్వడానికి కూడా రంగం సిద్ధం చేసుకుంది. ఏక్తా ఫిల్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై హిమ్మత్ లడుమోర్ నిర్మాణంలో ఓ విమెన్ సెంట్రిక్ మూవీ చేస్తున్నది అనన్య నాగళ్ల. ఈ చిత్రానికి రాకేష్ జగ్గి దర్శకుడు. ఇందులో అనన్య ట్రైబల్ లేడీగా కనిపిస్తుందని సమాచారం. 'కాంత' అనే టైటిల్‌ను ఈ సినిమాకు పరిశీలిస్తున్నారు. ముంబయ్ హీరోయిన్లు టాలీవుడ్‌లో పాగా వేస్తున్న నేటి తరుణంలో ఓ తెలుగమ్మాయి బాలీవుడ్ సినిమాలో లీడ్ రోల్ చేయడం నిజంగా తెలుగువారందరికీ గర్వకారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఏదైనా ఈ నేలమీద ఉన్నప్పుడే సేసేయాలా..




మైదానమంతా జనసందోహం.. కథానాయకుడి రాకకోసం కేరింతలు.. అప్పుడొచ్చాడు హీరో.. భుజంపై బ్యాట్‌ను మోస్తూ.. పెదవుల మధ్య బీడీని అటూఇటూ కదిలిస్తూ.. స్టైల్‌గా పొగ వదులుతూ.. గ్రౌండ్‌లోకి పవర్‌ప్యాక్ ఎంట్రీ ఇచ్చాడు. నడుచుకుంటూ వెళ్తున్నాడు. మరోవైపు అతని మాటలు వినిపిస్తున్నాయి. 'ఒకే పని సేసేనాకి, ఒకేనాగ బతికేనాకి ఇంత పెద్ద బతుకెందుకు?.. ఏదైనా ఈ నేలమీద ఉన్నప్పుడే సేసేయాలా.. పుడతామా ఏటీ మళ్లీ.. సెప్మీ!..' అంటూ గ్రీజులోకి ఎంటరై.. బ్యాట్ చేతబట్టి.. హ్యాండిల్‌ని నేలపై కొట్టి.. బలంగా బందిని బాదితే.. అది బౌండరీ దాటితే.. ఇక చెప్పేదేముంది! గూజుబంప్సే. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. దాని ముచ్చటే ఇదంతా. ఈ గ్లింప్స్‌లో 'పెద్ది'గా రామ్‌చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్.. మాటల్లో పదును.. ఉత్తరాంధ్ర డిక్షన్ పలికిన తీరు.. ఆ బాడీ లాంగ్వేజ్ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంది. హీరో పాత్రలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేలా ఈ గ్లింప్స్ ఉందని చెప్పొచ్చు. వచ్చే ఏడాది మార్చి 27న రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ ద్వారా తెలియజేశారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలను ఆకాశంలో కూర్చోబెట్టాడు దర్శకుడు బుచ్చిబాబు సానా. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేల్, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాత: వెంకటసతీశ్ కిలారు, సమర్పణ: మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.



## ఎమోషన్స్ కనెక్టయ్యాయ్..

తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'LYF - Love Your Father'. ఎస్పీ చరణ్, శ్రీహర్ష, కషిక కపూర్ ప్రధాన పాత్రధారులు. పవన్ కేతరాజు దర్శకుడు. రామస్వామిరెడ్డి, కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.సామ్రాజ్యం, ఎ.చేతన్ సాయిరెడ్డి నిర్మాతలు. ఇటీవలే సినిమా విడుదలైంది. సక్సెస్ సెలబ్రేషన్స్‌ని హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించారు. ఈ చిత్రంలో భాగమైనందుకు ప్రధాన తారాగణం ఆనందం వ్యక్తం చేశారు. ఇందులోని ఎమోషన్స్ ఆడియన్స్‌కి బాగా కనెక్టయ్యాయని, ఫోన్లు చేసి మరీ అభినందిస్తున్నారని దర్శకుడు చెప్పారు. తమ మనీషా సంస్థ గౌరవాన్ని మరింత పెంచిన సినిమా ఇదని, సినిమాకు చక్కని ఆదరణ లభిస్తున్నదని నిర్మాతల్లో ఒకరైన కిశోర్ రాఠీ ఆనందం వెలిబుచ్చారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.



## ఉత్కంఠను రేకెత్తించే ఎర్రచీర

బేబీ సాయితేజస్విని ప్రధాన పాత్రలో నటించిన హారర్ యాక్షన్ థ్రిల్లర్ 'ఎర్రచీర'. సుమన్‌బాబు దర్శకత్వం వహించడంతోపాటు ఇందులో కీలక పాత్రను కూడా పోషించారు. శివరాత్రి కానుకగా విడుదల కావాల్సిన ఈ సినిమా అనివార్య కారణాలవల్ల వాయిదా పడింది. ఈ నెల 25న సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుందని, సకుటుంబంగా చూడదగ్గ సినిమా ఇదని నిర్మాతల్లో ఒకరైన ఎన్‌వీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో 45 నిమిషాల గ్రాఫిక్స్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: చందు, మాటలు: గోపి విమల పుత్ర.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.